ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
చిత్తూరు జిల్లా వార్తలు
సోమవారం 24 మార్చి 2025



ఎస్సీలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి గతంలో టీడీపీ ప్రభుత్వం సబ్సిడీ రుణాలను విరివిగా మంజూరు చేసింది. వివిధ రంగాల్లో అనుభవం ఉన్నవారికి వారు కోరుకున్న యూనిట్లను మంజూరు చేసింది. అలాగే ఇన్నోవా, ఎతియోస్ వాహనాలను కూడా రుణాలపై ఇచ్చింది. ఇన్నోవా వాహనం రూ.18లక్షల నుంచి రూ.20 లక్షలుంటే.. ఎతియోస్ వాహనం రూ.8లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉండేది. ఇందులో లబ్ధిదారు మహిళ అయితే 50 శాతం, పురుషుడైతే 35 శాతం రాయితీ ఇచ్చారు. వాహనాలను తీసుకున్న లబ్ధిదారులు రుణం చెల్లించడంలో జాప్యం చేస్తున్నారు. రికవరీకోసం అధికారులేమో లబ్ధిదారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

- చిత్తూరు అర్బన్, ఆంధ్రజ్యోతి

ఎస్సీ రుణమే కదా..
ఎగ్గొడితే పోలా..!

2016-19 మధ్యలో 145 ఇన్నోవా, ఎతియోస్ వాహనాల మంజూరు

రూ.15.05 కోట్లకు ఇప్పటివరకు కట్టింది రూ.3.66 కోట్లు మాత్రమే

టీడీపీ హయాంలో 2016-17 ఆర్థిక సంవత్సరంలో 13 మందికి ఇన్నోవా, 9మందికి ఎతియోస్ కార్లను మంజూరు చేసింది. ఈ 22 మంది కలిపి రూ.2.10 కోట్ల కట్టాల్సి ఉండగా, ఇప్పటివరకు రూ.93లక్షలు మాత్రమే చెల్లించారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో 39 మందికి ఇన్నోవా, 11 మందికి ఎతియోస్ కార్లను మంజూరు చేశారు. వీరు రూ.5.45 కోట్లకుగాను రూ.1.33 కోట్లు మాత్రమే చెల్లించారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో 50మందికి ఇన్నోవా, 23మందికి ఎతియోస్కార్లను మంజూరు చేశారు. వీరు రూ.7.48 కోట్లకు ఇప్పటివరకు రూ.1.39 కోట్లు మాత్రమే చెల్లించారు. ఈ విధంగా 2016-19 వరకు 145 మంది ఇన్నోవా, ఎతియోస్ కార్లను తీసుకున్నారు. వీరంతా కలిపి రూ.15.05 కోట్లకుగాను రూ.3.66 కోట్లను మాత్రమే ఇప్పటివరకు చెల్లించారు.

పలు కారణాలు చూపుతూ..

ఇన్నోవా వాహనం తీసుకున్న లబ్ధిదారుడు నెలకు సుమారు రూ.23వేలు చెల్లించాల్సి ఉంది. ఎతియోస్ కారు తీసుకున్నవారు నెలకు రూ.7,500 నుంచి రూ.8వేల వరకు కట్టాలి. 2019, 2020లో కరోనా కారణంగా కంతులను కట్టలేమని చెప్పడంతో ప్రభుత్వం కూడా ఒత్తిడి చేయలేకపోయింది. 2021 నుంచి ఇప్పటివరకు వాహనాలు బాడుగలకు పోవడం లేదని కొందరు చెబుతుంటే, ఇంకొందరు అనారోగ్య సమస్యలను చూపుతూ చెల్లింపులు చేయడం లేదు. మరికొందరు ఎల్లో బోర్డు కారణంగా ట్యాక్స్ అధికంగా వస్తోందన్న కారణాన్ని చూపుతున్నారని ఎస్సీ కార్పొరేషన్ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హెచ్చరికలు జారీ చేస్తున్నా..

వాహనాలను తీసుకునే సమయంలో కొందరు ప్రభుత్వ ఉద్యోగి ష్యూరిటీ ఇచ్చారు. మరికొందరు తమ ఇంటి పత్రాలు, భూముల పత్రాలను ష్యూరిటీ కింద ఎస్సీ కార్పొరేషన్ అధికారులకు ఇచ్చారు. వీటి ఆధారంగా కార్పొరేషన్ అధికారులు వారికి హెచ్చరికలు జారీ చేస్తూనే ఉన్నారు. బృందాలుగా ఏర్పడి రికవరీ కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. అధికారులు వస్తున్నారని తెలిసిన లబ్ధిదారులు తమ ఫోన్లను స్విచాఫ్ చేసుకుని ఇళ్ల నుంచి వెళ్లిపోతున్నారు.

ప్రభుత్వం మాఫీ చేస్తుందన్న ఆలోచనలో..

20 ఏళ్లకు ముందు సబ్సిడీ రుణాల మొత్తాలను అప్పటి ప్రభుత్వం మాఫీ చేసింది. అదే తరహాలో ఇప్పుడు కూడా ప్రభుత్వం మాఫీ చేస్తుందన్న ఆలోచనలో లబ్ధిదారులు ఉన్నారు. అందువల్లే చాలామంది కంతులను కట్టడం లేదని సమాచారం.



నోటీసులు ఇస్తున్నాం

2016 నుంచి 2019 వరకు ఇన్నోవా, ఎతియోస్ కార్లను తీసుకున్న లబ్ధిదారులు సరిగా కంతులు కట్టడం లేదు. దీంతో వీరికి ష్యూరిటీ ఇచ్చినవారికి ఉద్యోగుల జీతాల నుంచి రికవరీ చేస్తామని హెచ్చరిస్తున్నాం. చివరి ప్రయత్నంగా లబ్ధిదారులకు నోటీసులు ఇస్తున్నాం. స్పందించకపోతే ఏం చేయాలో కలెక్టర్తో మాట్లాడి నిర్ణయం తీసుకుంటాం.

- చెన్నయ్య, ఈడీ, ఎస్సీ కార్పొరేషన్

నేడు 'పీజీఆర్ఎస్'

చితూరు అర్బన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామని తెలిపారు. ఆయా మండల, నియోజకవర్గాల్లో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

జిల్లా పోలీసు కార్యాలయంలోనూ..

జిల్లా పోలీసు కార్యాలయంలోనూ సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బాధితుల నుంచి వినతిపత్రాలను స్వీకరించి, వారి సమస్యలకు పరిష్కారం చూపుతామని తెలిపారు. బాధిత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:29 (సోమవారం సాయంత్రం)
సహర్: 4:54 (మంగళవారం ఉదయం)

వీఆర్వో ఆత్మహత్య !

చిత్తూరు రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలం ముత్తుకూరు వీఆర్వో తనీషా ఆత్మహత్య చేసుకున్నారు. ఈమె చిత్తూరు కొంగారెడ్డిపల్లెలో నివాసం ఉంటున్నారు. శనివారం మధ్యాహ్నం హానికరమైన రసాయనం తాగేశారు. గుర్తించిన భర్త, బంధువులు ఆమెను చీలాపల్లె సీఎంసీకి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. దీనిపై పోలీసులకు సమాచారం అందలేదు.

త్వరలోనే పెండింగ్ వ్యవసాయ
విద్యుత్ కనెక్షన్లు ఇస్తాం

● ఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్



జిల్లాలో 2,500 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పెండింగ్లో ఉన్నాయని ఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. వీటిల్లో అత్యధికంగా పుంగనూరు విద్యుత్ డివిజన్లోనే 1,800 ఉన్నాయని చెప్పారు. ఆరు నెలలుగా మెటీరియల్ రాలేదని, త్వరలోనే కనెక్షన్నీ ఇస్తామని స్పష్టం చేశారు. అలాగే పలు అంశాలపై ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడారు.

ఫటా ఫట్

? నాణ్యమైన విద్యుత్ కోసం తీసుకుంటున్న చర్యలు

! పీఎం కుసుమ్ అనే పథకం వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలని కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద ప్రతి సబ్స్టేషన్ ఫీడర్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఏర్పాటు చేస్తున్నాం. దీనివల్ల రైతులకు వ్యవసాయ మోటర్లు కాలిపోవు. లోటల్టేజీ సమస్య ఉండదు. కుప్పంలోని అన్ని విద్యుత్ సబ్స్టేషన్లలో 100 శాతం ఏర్పాటు చేయడానికి 140 మెగా యూనిట్లు, జిల్లా మొత్తం 80 మెగా యూనిట్లు ఉత్పత్తికి సోలార్ కరెంట్కు చర్యలు తీసుకున్నాం.

? సబ్స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నారా

! గతంలో కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో విద్యుత్ సబ్స్టేషన్లు ఏర్పాటు చేయకపోవడంతో కుప్పంలో 6, పలమనేరులో 3, గంగాధరనెల్లూరులో 2 చొప్పున ప్రస్తుతం విద్యుత్ సబ్స్టేషన్లు మంజూరయ్యాయి. పెద్దపంజాణి మండలంలో ఉన్న విద్యుత్ సమస్యలు పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టాం.

? విద్యుత్ బకాయిలు చెల్లింపులు ఎలా ఉన్నాయి

! జిల్లాలో గృహ అవసరాలు, ప్రైవేటు సంస్థలు వినియోగించిన విద్యుత్కు సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, హాస్టళ్లు, విద్యాసంస్థలు, ఆస్పత్రులు, రెవెన్యూ తదితర కార్యాలయాలకు సంబంధించి బిల్లులు పెండింగ్లో ఉన్నాయి. ఏప్రిల్ 17వ తేదీలోపు ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలకు చెందిన పెండింగ్ విద్యుత్ బకాయిలు చెల్లిస్తే సర్చార్జి మాఫీ అవుతుందని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. అధికారులు సహకరించాలి.

? పీఎం సూర్యఘర్ పథకంతో ప్రయోజనం

! పీఎం సూర్యఘర్ పథకంతో అనేక ప్రయోజనాలున్నాయి. ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసి కరెంట్ ఉత్పత్తికి కంపెనీలనుబట్టి రూ.2.50 లక్షల వరకు వ్యయం అవుతుండగా బ్యాంకుల ద్వారా 80 శాతం రుణం ఏర్పాటు చేసి నెలలోపు రాయితీ మొత్తం ప్రభుత్వం వినియోగదారుడి బ్యాంక్ ఖాతాలో జమచేస్తుంది. బ్యాంకు రుణం అవసరం లేకుండా ఏర్పాటు చేసుకున్న వారికి కూడా రాయితీ ఇస్తుంది. ఇంటి అవసరాలకు వాడుకుని మిగిలిన సోలార్ కరెంట్ను ఒక యూనిట్ రూ.2.09 పైసలుకు ఎస్పీడీసీఎల్ కొనుగోలు చేస్తుంది.

- పుంగనూరు, ఆంధ్రజ్యోతి

పోలీసుల్ని ఇష్టానికి
బదిలీ చేశారు

● వాళ్లింట్లో మమ్మల్ని తిట్టుకుంటున్నారు
● ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



సమావేశంలో ప్రసంగిస్తున్న అమరనాథరెడ్డి

పలమనేరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలీసుల్ని ఇష్టానుసారం బదిలీ చేసి వాళ్లింట్లో మమ్మల్ని తిట్టుకునేలా చేశారని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. ఆదివారం పలమనేరులో నిర్వహించిన టీడీపీ క్లస్టర్ యూనిట్ బూత్ కమిటీల సమావేశంలో ఆయన బదిలీల విషయమై స్పందించారు. 'వైసీపీకి పనిచేసిన పోలీసులను మార్చమని నేను చెప్తే.. ఇష్టానికి బదిలీలు చేశారు. వాళ్లింట్లో పెళ్లాం, పిల్లలు నన్ను తిట్టుకునేలా చేస్తున్నారు. మనం శాశ్వతం కాదు, అధికారులు శాశ్వతం. ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే దానికి అనుగుణంగా పని చేస్తారు. గత ప్రభుత్వ హయాం నుంచీ పని చేస్తున్నవారికి ఆ పార్టీ నాయకులతో సంబంధాలు ఉంటాయని పక్కకు మార్చమని చెప్పాను. దాన్ని పట్టించుకోకుండా ఈ మూల నుంచి ఆ మూలకు విసిరేశారు' అన్నారు. పుంగనూరులో టీడీపీ కార్యకర్త రామకృష్ణ హత్య ఘటన నేపథ్యంలో అమరనాథరెడ్డి ఘాటుగా స్పందించిన విషయం తెలిసిందే. ఎస్పీ మణికంఠ తీరు వల్లే హత్య జరిగిందని, వైసీపీ హయాం నుంచి అవే స్థానాల్లో కొనసాగుతున్న పోలీసుల్ని బదిలీ చేయలేదని ఆరోపించారు. దీంతో ఎస్పీ ఇటీవల 264 మంది పోలీసుల్ని దూర ప్రాంతాలకు బదిలీ చేయడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.



డీసీసీబీలో జరుగుతున్న కంప్యూటరీకరణ ప్రక్రియలో నిమగ్నమైన సిబ్బంది

ఆన్లైన్ బాటలో
సింగిల్విండోలు

● జోరుగా కంప్యూటరీకరణ ప్రక్రియ ● ఇప్పటివరకు 55 విండోల్లో పూర్తి

డీసీసీబీతో అనుసంధానం

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సింగిల్విండోలను కంప్యూటరీకరించి డీసీసీబీతో అనుసంధానం చేస్తున్నాం. ప్రస్తుతం 2024-25 ఆర్థిక సంవత్సర లావాదేవీల వివరాలన్నీ సహకార పోర్టల్లో నమోదు చేస్తున్నాం. ఈనెల 25లోగా కంప్యూటీకరణ ప్రక్రియ పూర్తి చేసి.. ఏప్రిల్ ఒకటి నుంచి అన్ని విండోల్లో ఈ-సేవలు అందుబాటులోకి తెస్తాం.

- శంకర్బాబు, సీఈవో, డీసీసీబీ, చిత్తూరు



చిత్తూరు కలెక్టరేట్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘా (సింగిల్విండో)ల్లో కంప్యూటరీకరణ ప్రక్రియ దాదాపు కొలిక్కివచ్చినట్లే. దాంతో మాన్యువల్ విధానంలో లావాదేవీలను అంచెలంచెలుగా నిలిపివేస్తారు. విండోలవారీగా నగదు, లెడ్జర్ పుస్తకాలను సీజ్ చేసి.. బీరువాల్లో భద్రపరిచే చర్యలను అధికారులు చేపట్టారు. ఈ ప్రక్రియను పూర్తిచేసిన సింగిల్విండోల కార్యాలయాల వద్ద ఈ-ప్యాక్స్ కింద ఏప్రిల్ ఒకటో తేదీనుంచి ఆన్లైన్ సేవలు అందించనున్నట్లు నోటీసులు అంటిస్తున్నారు.

సీబీఎస్ మాడ్యూల్లో..

పుస్తకాలతో పనిలేకుండా బ్యాంకుల తరహాలో సింగిల్విండోల్లోనూ ఆన్లైన్లోనే ఎంట్రీలు నమోదు చేస్తారు. డిపాజిట్ల సేకరణ, రుణాల మంజూరు, పద్దులవారీగా బకాయిల వసూళ్లు, బంగారం కుదువ, ఎరువుల అమ్మకాలు, కొనుగోళ్ల లావాదేవీలన్నీ ఆన్లైన్లో నిర్వహిస్తారు. ఆప్కాబ్, డీసీసీబీ బ్రాంచీల తరహాలోనే కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్(సీబీఎస్) మాడ్యూల్లో సాగనున్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో 75 విండోలు ఉన్నాయి. రోజువారీ ప్రత్యక్ష పర్యవేక్షణ ప్రక్రియను జేసీ విద్యాధరి చేపట్టి సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ఈ కారణంగా ఆదివారం నాటికి 55 విండోల్లో కంప్యూటరీకరణ ప్రక్రియ పూర్తవగా, అక్కడ అనధికారికంగా ఈ-సేవలు ప్రారంభమయ్యాయి. మిగిలిన 20 విండోల్లో సైతం ఈ ప్రక్రియను ఈనెల 25లోగా పూర్తి చేయాలని సహకార శాఖ అధికారులను ఆదేశించారు. దాంతో డీసీసీబీ బ్యాంకు, విండోల అధికారులు, సీఈవోలు, సిబ్బంది, కంప్యూటర్ సహాయకులు, డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో ఈ ప్రక్రియ పూర్తి చేయడంలో నిమగ్నమయ్యారు.

సభ్యుల వివరాలిలా..

75 సింగిల్విండోల పరిధిలో 538834 మంది సభ్యుల వివరాలను ఆన్లైన్లోకి ఎక్కిస్తున్నారు. వీరిలో 461117 మంది సభ్యుల, 77717 మంది రుణగ్రహీతల వివరాలు ఉన్నాయి. ఈ వివరాలన్నింటినీ రాష్ట్ర సహకార శాఖ ఇచ్చిన పోర్టల్లో నమోదు చేస్తున్నారు. ఆన్లైన్ సేవల్లో భాగంగా సీఈవో చెక్కర్గా, కంప్యూటర్ సహాయకుడు మేకర్గా ఉంటారు. చాలాచోట్ల కంప్యూటర్ సహాయకులు లేకపోవడంతో పొరుగుసేవల సిబ్బంది ద్వారా విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి ఖాతాను ఆధార్తో అనుసంధానం చేస్తున్నారు. దీంతో ఇతర బ్యాంకుల్లో రుణాలు పొందిన, బినామీ రుణాలన్నీ బయటపడుతున్నాయి. పైగా విండోల్లో ఎంత నిల్వ ఉంది, ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. పర్యవేక్షణ ఎక్కువగా ఉండటం వల్ల అక్రమాలకు తావుండదు.

రేపటినుంచి పుంగనూరు గంగజాతర

● ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ



జమీందార్లతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ ప్రభాకర్

పుంగనూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో మంగళ, బుధవారాల్లో సుగుటూరు గంగమ్మ జాతర జరగనుంది. ఈ క్రమంలో గంగజాతర ఏర్పాట్లు, భద్రతపై నగరిలోని జమీందార్ల ప్యాలెస్ను అధికారులతో కలిసి ఆదివారం పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ పరిశీలించారు. జాతర ప్రశాంతంగా జరగడానికి అందరూ సహకరించాలని కోరారు. ప్యాలెస్లోని జమీందార్లు సోమశేఖర్ చిక్కరాయులు, మల్లికార్జునలతో చర్చించారు. అమ్మవారిని కొలువుదీర్చే స్థలం పురాతన భవనం కావడంతో భక్తుల రద్దీని తగ్గించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అమ్మవారి ఊరేగింపు రహదారులను పర్యవేక్షించారు. అలాగే విద్యుత్, మున్సిపల్, అగ్నిమాపక శాఖ, ఆరోగ్య, ఇంజనీరింగ్ అధికారులు కూడా భక్తులకు సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చిన్నపిల్లల భద్రత దృష్ట్యా పేరెంట్ ట్యాగ్ విధానాన్ని ప్రవేశ పెడతామని చెప్పారు. ట్యాగ్లో పిల్లల తల్లిదండ్రులు, పుంగనూరు ఎస్ఐ ఫోన్ నెంబరు పొందుపరుస్తామన్నారు. దొంగతనాలు జరగకుండా పోలీసులను మఫ్టీలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చిత్తూరు ఎస్బీ సీఐ భాస్కర్, పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్, సీసీఎస్ సీఐ ఉమామహేశ్వర్ రావు, ఎస్పీడీసీఎల్ ఏడీఈ పి.శ్రీనివాసులు, ఎస్ఐ లోకేశ్, ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు, రెవెన్యూ, ఎక్సైజ్ తదితర శాఖల అధికారులు, కమిటీ సభ్యులు, హిందూ, ముస్లిం మతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవులు కావడంతో ఆంధ్ర, తెలంగాణ నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 25వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 515 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 2,787మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,219మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,822మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,242, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 347, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 310మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 81మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 20,262 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.



ఆలయం వద్ద భక్తుల సందడి



ఒకే ఈతలో మూడు దూడలు

● రెండు మృతి

ఐరాల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఐరాల మండలం నాగమవాండ్లపల్లె పంచాయతీ వెదర్లపల్లె గ్రామంలోని వినోద్కుమార్కు చెందిన ఆవు ఆదివారం ఒకే ఈతలో మూడు కోడె దూడలకు జన్మనిచ్చింది. ఇందులో ఒకటి కడుపులోనే మృతి చెందింది. గంట తర్వాత మరో దూడ మృతి చెందింది. మిగిలిన దూడ ఆరోగ్యంగా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. వీటిని స్థానికులు ఆసక్తిగా చూశారు.



తిరుమలేశుడి సర్వదర్శనానికి 16 గంటలు

తిరుమల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూ ఏటీజీహెచ్ వరకు వ్యాపించింది. ఇక, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శుక్రవారం హుండీ ఆదాయం: రూ.3.40 కోట్లు
శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,428
తలనీలాలు సమర్పించిన వారు : 31,920



ఏబీఎన్- ఆంధ్రజ్యోతి నిర్వహించిన 'వైద్యజ్యోతి' కార్యక్రమంలో ఉచిత వైద్యసేవలు అందించి జ్ఞాపికలు అందుకున్న వైద్యులు, వైద్య సిబ్బంది, నిర్వాహకులు

వైద్యార్తులకు దారిదీపమైన 'వైద్య జ్యోతి'

- 'ఏబీఎన్- ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యాన రెండు రోజుల పాటు నిర్వహణ
- అనూహ్య స్పందనతో ముగిసిన హెల్త్‌మీట్

తిరుపతి, మార్చి23 (ఆంధ్రజ్యోతి): ఏబీఎన్- ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో 'వైద్యజ్యోతి' పేరిట రెండు రోజుల పాటు నిర్వహించిన మెగా హెల్త్‌మీట్.. వైద్యార్తులకు దారిదీపంలా మారింది. తిరుపతిలోని తుడా ఇందిరా మైదానంలో శని, ఆదివారాల్లో జరిగిన ఈ కార్యక్రమానికి నగరంతో పాటు జిల్లాలోని పలుప్రాంతాలనుంచి చికిత్స కోసం, వైద్యసలహాల కోసం రోగులు పోటెత్తారు. ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు జరిగిన వైద్యజ్యోతిలో దాదాపు నాలుగు వేల మంది రోగులను వైద్యులు పరీక్షించి.. అవసరమైన ప్రాథమిక వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. మందులూ ఉచితంగా అందించారు. మెరుగైన వైద్యం కోసం ఆయా ఆస్పత్రులకు రెఫర్ చేశారు. ఎన్టీఆర్ వైద్యసేవ అర్హులైనవారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని చెప్పడంతో పాటు వైద్యసేవ పరిధిలో లేని వ్యాధులకు ప్రత్యేక రాయితీలను ప్రకటించారు. ఇలాంటి హెల్త్‌మీట్‌లలో అన్ని రకాల వైద్యనిపుణులను ఒకే గొడుగు కిందకు తీసుకు రావడం వల్ల ఎంతో ఉపయోగంగా ఉండిందని రోగులు అన్నారు. భవిష్యత్తులోనూ 'ఆంధ్రజ్యోతి' నిర్వహించే ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొంటామని వైద్యులు తెలిపారు. ఇక, శిబిరంలో శ్రీసాయిసుధ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి తరఫున డాక్టర్ రాళ్లపల్లి సుధారాణి పాల్గొని కంటి సమస్యతో బాధపడే రోగులను పరీక్షించి కంటి అద్దాలు అందజేశారు. ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో వైద్యులు, సిబ్బందికి 'వైద్యజ్యోతి' జ్ఞాపికలను ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజర్ సురేశ్‌రెడ్డి, సిబ్బంది అందజేశారు.

సర్వమానవాళి సౌభ్రాతృత్వం కోసం సైకిల్ యాత్ర



సైకిల్‌యాత్ర చేస్తున్న అశోకస్వామి

నగరి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సర్వమానవాళి సౌభ్రాతృత్వం, సుఖశాంతుల కోసం తమిళనాడులోని ఘటికాచలానికి సైకిల్‌యాత్ర చేపట్టినట్లు నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం శ్రీపతిరావుపేటలోని అంజనేయస్వామి గుడి ప్రధాన అర్చకుడు అశోకస్వామి తెలిపారు. ఈనెల 19వతేదీన ఉదయం 8.30 గంటలకు ప్రారంభించిన యాత్ర.. నంద్యాల, ఆళ్లగడ్డ, మైదుకూరు, కడప, రేణిగుంట మీదుగా ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు నగరికి చేరుకుంది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆత్మకూరు నుంచి ఘటికాచలానికి సుమారు 450 కిలోమీటర్లు ఉంటుందని చెప్పారు. గతంలోనూ ఆత్మకూరు నుంచి అరుణాచలం మీదుగా మంత్రాలయానికి సైకిల్‌యాత్ర చేశానన్నారు.

పశువుల దొంగకు దేహశుద్ధి



పట్టుబడ్డ దొంగ

పుంగనూరు రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పశువులను చోరీ చేయడానికి వచ్చిన దొంగకు గ్రామస్థులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన సంఘటన పుంగనూరు మండలంలో శనివారం అర్థరాత్రి జరిగింది. పుంగనూరు మండలం భీమగానిపల్లె దేవాలయంలో ప్రతి శుక్ర, శనివారాల్లో గ్రామస్థులు భజన చేయడం ఆనవాయితీగా వస్తోంది. అయితే అదే గ్రామానికి చెందిన మల్లికార్జున ఇంటి వద్ద బిహార్‌కు చెందిన ఆరుగురు దొంగలు పాడి ఆవులను తీసుకెళ్లడానికి ప్రయత్నం చేశారు. గ్రామంలోని వీధికుక్కలు అరవడంతో గ్రామస్థులు వారిని పట్టుకోవడానికి ప్రయత్నించారు. దొంగలు పరుగులు తీయడంతో వెంటాడి ఒకరిని పట్టుకున్నారు. అతడికి దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పట్టుబడిన దొంగను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

శ్రీవారి సేవలో మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భవానీ సుబ్బరాయన్ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్న ఆమెకు ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించడంతో పాటు లడ్డూప్రసాదాలు అందజేశారు.

పంటలపై గజదాడులు

ఎర్రావారిపాళెం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): శేషాచల అడవుల్లో శాశ్వత నివాసం ఏర్పరుచుకున్న ఏనుగులు వేసవి ప్రారంభం కాగానే పొలాలపై దాడులకు తెగబడుతున్నాయి. ఇంతవరకు దట్టమైన తలకోన అడవుల్లో తిష్ఠవేసి ఉన్న గజరాజులు ఆదివారం ఉదయం 11 గంటలకు నెరబైలు పొలాల మీదుగా ఉదయమాణిక్యం పంటలవైపు సాగాయి. వరి, మామిడి, టమోటా, కొబ్బరి పంటలను ధ్వంసం చేశారు. ఉదయమాణిక్యం పంచాయతీ గడ్డవారిపల్లె పొలాల్లో చేరాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు నెరబైలు గ్రామం, ఉదయమాణిక్యం పంచాయతీ సరిహద్దు పొలాల్లోనే ఉన్నాయి. పలువురు రైతుల మామిడి పంటలను తినేశాయి. వరిపైర్లను తొక్కేశాయి. గడ్డంవారిపల్లె రైతులు గట్టిగా కేకలు వేయడంతో పక్కనే ఉన్న గుట్టలోకి చేరాయి. రాత్రి 10 గంటల వరకు అక్కడే తిష్ఠవేశాయి. ఎప్పుడు ఎటువైపు దాడులు చేస్తాయో తెలియక సమీప గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా ఏనుగుల దాడులు నుంచి తమ పంటలకు శాశ్వత రక్షణకు పరిష్కారం చూపాలని రైతులు అధికారులను కోరుతున్నారు. గతంలో ఏనుగుల దాడుల్లో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించేదని రెండు, మూడు సంవత్సరాల నుంచి చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

వేదవిద్య దినదినాభివృద్ధి చెందాలి

- అహోబిల మఠాధిపతి

తిరుమల, మార్చి23(ఆంధ్రజ్యోతి): వేదవిద్య దినదినాభివృద్ధి చెందాలని అహోబిల మఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామిజీ అన్నారు. తిరుమలలోని ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠాన్ని ఆయన ఆదివారం ఉదయం సందర్శించి విద్యార్థులకు అనుగ్రహ భాషణం చేశారు. వేద విద్యాభివృద్ధికి టీటీడీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. వేద విద్యావిధానం అమలుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో కలిసి 17 వేదాలను పఠించారు. వేదవిజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్ కుప్పా శివసుబ్రహ్మణ్య అవధాని, టీటీడీ ఆగమ సలహాదారులు మోహనరంగాచార్యులు, వేద, ఆగమ పండితులు పాల్గొన్నారు.

మఠంలో 'శ్రీవేదాంతదేశిక స్తోత్రమాలికా' ఆవిష్కరణ

తిరుమలలోని అహోబిలం మఠంలో ఆదివారం 'శ్రీవేదాంతదేశిక స్తోత్రమాలికా' గ్రంథాన్ని మఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ దేవికుల స్తోత్రాలన్నీ మంత్రగర్భితములని, మనిషి కష్టాలను, వ్యాధులను పోగొట్టడంతో పాటు చదువు, సంస్కారాన్ని ఇస్తాయన్నారు.

నెలబల్లికి చేరిన సీఐఎస్ఎఫ్ సైకిల్ ర్యాలీ



దొరవారిసత్రం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): 'సురక్షిత తీరం.. సమృద్ధి భారత్' పేరిట కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) చేపట్టిన సైకిల్ ర్యాలీ.. ఆదివారం తిరుపతి జిల్లాలోని దొరవారిసత్రం మండలం నెలబల్లి సమీపంలోని వాసవి ఆశ్రమానికి చేరింది. స్థానిక మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. ఈనెల పదో తేదికి 55 వసంతాలు పూర్తి చేసుకున్న సీఐఎస్ఎఫ్ సముద్ర తీరప్రాంత ప్రజలలో దేశ భద్రత, సమైక్యతను పెంపొందించేందుకు సైకిల్ ర్యాలీ చేపట్టింది. 60 మంది సీఐఎస్ఎఫ్ బృందంతో ఈనెల 7న వెస్ట్ బెంగాల్‌లోని బక్కాలీలో ప్రారంభమైన సైకిల్ ర్యాలీ.. సోంపేట, శ్రీకాకుళం, విశాఖపట్నం, అన్నవరం, అమలాపురం, మచిలీపట్నం, చీరాల, ఒంగోలు, కావలి, నాయుడుపేట మీదుగా దొరవారిసత్రం మండలం నెలబల్లికి చేరింది. సూళ్లూరుపేట, తడ మీదుగా తమిళనాడులోకి ప్రవేశిస్తుందని సీనియర్ కమాండెంట్ కార్తికేయన్ తెలిపారు.

అప్రమత్తతే రక్ష

- వేగంగా ప్రబలే వ్యాధి క్షయ
- తెలియకుండానే ఇతరులకు వ్యాప్తి చేస్తున్న బాధితులు
- అనుమానం వస్తే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలంటున్న వైద్యులు

- నేడు ప్రపంచ క్షయ నివారణ దినం



చిత్తూరు రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గతంలో ప్రపంచాన్ని భయాందోళనకు గురిచేసిన వ్యాధి క్షయ. వేగంగా ప్రబలే వ్యాధుల్లో ఇది కూడా ఒకటి. ప్రతి వెయ్యి మందిలో 10 మందికి ఈ వ్యాధి సోకి అస్వస్థతకు గురవుతున్నారు. మరోవైపు దీనిబారినపడ్డ బాధితులు తమకు తెలియకుండానే ఇతరులకు వ్యాప్తి చేస్తున్నారు. అందువల్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. అనుమానం వస్తే వెంటనే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలంటున్నారు. సోమవారం ప్రపంచ క్షయ నివారణ దినం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం

ఉచిత నిర్ధారణ పరీక్షలు, చికిత్స

జిల్లాలో 2023-24 ఏప్రిల్ వరకు 2,986 కేసులు నమోదయ్యాయి. 2024 మే నుంచి ఈనెల 23వ తేదీనాటికే 2,531 కేసులు నమోదవగా, బాధితులకు ప్రభుత్వం ఉచితంగా చికిత్సను అందిస్తోంది. 33 మండలాల్లో ఆరోగ్య సిబ్బందితో పాటు ప్రైవేటు ఆస్పత్రుల సాయంతో రెండు వారాలకు మించి దగ్గు కలిగి, బరువు తగ్గి జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలోని జిల్లా క్షయవ్యాధి నివారణ కార్యాలయంలో నూతన సాంకేతిక పద్ధతి ట్రూనాట్, సీబీనాట్ మిషన్స్‌తో గళ్ల పరీక్షలు ఉచితంగా నిర్వహించి బాధితులను గుర్తిస్తున్నారు. వ్యాధి నిర్ధారణ అయినవారికి ఆరు నెలలపాటు మందులు ఉచితంగా పంపిణీ చేస్తారు. అలాగే మొండి వ్యాధిగ్రస్తులకు 6 నెలల నుంచి 18 నెలలు వరకు చికిత్స, మందులు ఉచితంగా అందిస్తారు. ఈ మందులను సక్రమంగా వాడితే వ్యాధి నయమవుతుంది.

ముందస్తు నివారణకు బీసీజీ టీకా

చిన్నారులు క్షయవ్యాధి బారిన పడకుండా కాపాడేందుకు కొన్ని దశాబ్దాలుగా బీసీజీ (బాసిల్లస్ కాల్మెట్-గురిన్) టీకాను ఒక అస్త్రంగా వాడుతున్నారు. శిశువులకు పుట్టిన వెంటనే తొలి ఏడాదిలోపు ఈ టీకా వేస్తారు. తాజాగా 18 ఏళ్ల పైబడిన వారికి జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్లు వేస్తున్నారు. మద్యం, పొగ తాగేవారికి.. క్షయవ్యాధిగ్రస్తులకు సన్నిహితంగా ఉన్నవారికి, 60 ఏళ్ల పైబడినవారందరికి బీసీజీ టీకా వేస్తున్నారు.

అన్ని పీహెచ్‌సీల్లో నిర్ధారణ పరీక్షలు

జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రా (పీహెచ్‌సీ)ల్లో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. వ్యాధి నిర్ధారణ అయితే ఆ వ్యక్తితోపాటు వారి కుటుంబీకులకు కూడా పరీక్షలు చేస్తారు. అంతే కాకుండా జిల్లాలోని కుప్పం, వి.కోట, పలమనేరు, పుంగనూరు, సదుం, చిత్తూరు, బంగారుపాళ్యం, పి.కొత్తకోట, నగరి, కార్వేటినగరం క్షయవ్యాధి నివారణ యూనిట్ల ద్వారా వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు, సూచనలు చేస్తున్నారు.

ఆర్థిక సాయాన్ని పెంచిన రాష్ట్ర ప్రభుత్వం

క్షయవ్యాధి బాధితులకు ప్రతి నెలా పోషకాహారం నిమిత్తం గత ఇస్తుండిన రూ.500 ఆర్థిక సాయాన్ని రూ.వెయ్యికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జిల్లాలో 2,531 మంది వ్యాధిగ్రస్తులు ఉన్నారు. వీరందరికీ ఆరు నెలలపాటు రూ.వెయ్యి చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమచేస్తారని జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారి తెలిపారు.

క్షయవ్యాధి రహిత జిల్లాగా చేయడానికి కృషి



జిల్లాను 2026 కంతా క్షయ వ్యాధి రహితంగా మార్చడానికి కృషి చేస్తున్నాం. ఇందుకోసం విరివిగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నాం. గతంలో కంటే ప్రజల్లో ఈ వ్యాధిపై అవగాహన పెరిగింది. అందుకే టెస్టుల శాతం కూడా పెరిగింది. ఇప్పటివరకు 2,531 మంది వ్యాధిగ్రస్తులను గుర్తించి, చికిత్స అందిస్తున్నాం. గత ఏడాది 43 పంచాయతీల్లో టీబీ ఫ్రీగా డిక్లేర్ చేశాం. వచ్చే 2026 కల్లా 200 పంచాయతీల్లో టీబీ ఫ్రీగా చేయాలని లక్ష్యం పెట్టుకున్నాం. అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టడం చేస్తున్నాం. జిల్లాలో ఇప్పటికే 65 శాతం మందికి బీసీజీ వ్యాక్సిన్లు వేశాం.

- వెంకటప్రసాద్, క్షయవ్యాధి నివారణ అధికారి

అనుమానాస్పద స్థితిలో కూలీ మృతి

సోమల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ కూలీ మృతిచెందిన సంఘటన ఆదివారం సోమల మండలం వల్లిగట్ల పంచాయతీలో జరిగింది. వివరాలిలా.. అగ్రహారంపల్లెకు చెందిన చలపతి (25), దేవిక దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. శనివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన చలపతి ఆదివారం ఉదయం వరకు ఇంటికి రాలేదు. గ్రామ సమీపంలోని బాలిశెట్టి కుంట వద్ద చలపతి మృతదేహాన్ని గ్రామస్థులు గుర్తించి కుటుంబ సభ్యులకు తెలిపారు. దేవిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మృతదేహాన్ని పుంగనూరు ప్రభుత్వ వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఎస్ఐ శివశంకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చలపతి మృతిపై గ్రామస్థులు, కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

లారీ, ప్రైవేటు కర్మాగారం బస్సు ఢీ

- ఆపై అదుపుతప్పి వాగులో పడ్డ బస్సు
- 15మందికి గాయాలు

శ్రీకాళహస్తి/వెంకటగిరిటౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు కర్మాగారం బస్సు, లారీ ఢీకొన్న ఘటనలో బస్సు అదుపు తప్పి వాగులో పడటంతో 15మంది గాయపడ్డారు. ఈ ఘటన శ్రీకాళహస్తి మండలంలోని ఎంపేడు సమీపంలో ఏర్పేడు - వెంకటగిరి రహదారిపై ఆదివారం జరిగింది. తిరుపతి విమానాశ్రయం సమీపంలోని ఓ ప్రైవేటు సెల్‌ఫోన్ కర్మాగారానికి చెందిన బస్సు కార్మికులను విధులకు తీసుకువచ్చేందుకు వెంకటగిరికి వచ్చింది. అక్కడి నుంచి 15మంది సిబ్బందితో ఏర్పేడు వైపుగా బయలుదేరింది. రాయచోటికి చెందిన రాజు కృష్ణపట్టణం పోర్టుకు వెళ్లేందుకు లారీతో వెళ్తున్నాడు. ఈక్రమంలో ఎంపేడు వద్ద లారీ, బస్సు ఢీకొన్నాయి. ఈ ఘటనలో అదుపు తప్పిన బస్సు పక్కనే ఉన్న వాగులోకి బోల్తా పడింది. క్షతగాత్రులకు స్థానికులు సహాయక చర్యలందించారు. ఇందులోభాగంగా డక్కిలి మండలం ఆల్తూరుపాడుకు చెందిన బస్సు డ్రైవర్ మునీంద్ర, వెంకటగిరి సమీపంలోని లింగసముద్రానికి చెందిన శివాజీ, లారీ డ్రైవర్ రాజు తీవ్రంగా గాయపడ్డారు. వీరితో పాటు గుండ్లకుంటకు చెందిన ప్రసాద్, వెంకటగిరికి చెందిన కుశల్, రాపూరు యశోద స్వల్పంగా గాయపడ్డారు. మొత్తం ఈ ఆరుగురుని 108 వాహనంలో చికిత్స నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తీవ్రంగా గాయపడిన, మునీంద్ర, శివాజీ, రాజును తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. ఘటనా స్థలంలో స్వల్పంగా గాయపడిన 9మంది క్షతగాత్రులు వివిధ ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి చికిత్సలు పొందారు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.







వాగులో పడిన బస్సు ● చికిత్స పొందుతున్న క్షతగాత్రులు ● ప్రమాదంలో దెబ్బతిన్న లారీ

పద్మావతి అమ్మవారి సేవలో ప్రముఖులు

తిరుచానూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం స్వాగతం పలకగా ముందుగా ఆయన ధ్వజస్తంభానికి నమస్కరించి, అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వదించి, అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. హైకోర్టు జడ్జి జస్టిస్ సురేశ్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. సాయంత్రం సినీనటుడు సుమన్ అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు.

ఎస్వీ పాలిటెక్నిక్‌కు రూ.1.30 లక్షల విరాళం

తిరుపతి(విద్య), మార్చి 23(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు పూర్వ విద్యార్థి రూ.1.30 లక్షల విరాళాన్ని ఆదివారం అందజేశారు. 1984-87 సంవత్సరంలో కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ చదివిన వై.సురేష్‌బాబు సీనియర్ స్టాటజిస్టుగా అమెరికాలో పనిచేస్తున్నారు. ఆయన తన తల్లి వై.గోవిందమ్మ ద్వారా ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలలోని స్ట్రెంగ్త్ ఆఫ్ మెటీరియల్స్ ల్యాబ్‌కుగాను ఈ విరాళాన్ని అందజేశారు. కళాశాల జనరల్ సెక్షన్ హెడ్ డాక్టర్ ఎస్.వి.గౌరీశంకర్‌కు చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఉమామహేష్, ఎస్.ఎం.ల్యాబ్ ఇన్‌చార్జి శాలం రాజు, సివిల్ లెక్చరర్ రాజమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

టైం స్కేల్ ఇవ్వండి

తిరుమల, మార్చి23(ఆంధ్రజ్యోతి): టీటీడీలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సొసైటీ ఉద్యోగులకు టైంస్కేల్ అమలు చేయాలని టీటీడీ సొసైటీ వర్కర్స్ అసోసియేషన్ కోరింది. విద్యార్హతలు కలిగిన వారికి పరీక్షలు నిర్వహించి, మెరిట్ ఆధారంగా రూల్స్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తూ తాము టీటీడీలో చేరామని, వివిధ సొసైటీల ద్వారా 20 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నామని, తమకంటే తక్కువ సర్వీస్ ఉన్న వారికి టైంస్కేల్‌ను అమలు చేస్తూ తమకు అన్యాయం చేస్తున్నారని వాపోయారు. సోమవారం జరగనున్న బోర్డు సమావేశంలో దీనిపై చర్చించి, తీర్మానం చేయాలని ఒక ప్రకటనలో కోరారు.

టెంకాయ చెట్టును ఢీకొన్న కారు

- ఇద్దరు తమిళనాడువాసుల మృతి
- ఆరుగురికి తీవ్ర గాయాలు
- రాష్ట్ర సరిహద్దులో ప్రమాదం





చెట్టును ఢీకొని నుజ్జయిన కారు, మృతి చెందిన సండ్రీన్ ఫాతిమా

తడ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, తమిళనాడు సరిహద్దులోని పన్నంగాడు వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న టెంకాయ చెట్లను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. చెన్నైలోని వేలచ్చేరికి చెందిన మహ్మద్ అవాజ్ ముంబాయిలోని ఓ సంస్థలో పనిచేస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం చెన్నైకు వచ్చాడు. స్థానికంగా ఇంజనీరింగ్ చదువుతున్న స్నేహితులు యోగీశ్వరన్, బెంజిమన్, ఆలీయా బేగం, శ్రీమాన్, మాదేష్, సండ్రీన్ ఫాతిమా, దీనదయాళ్‌తో కలిసి ఆదివారం ఉదయం వరదయపాళెం వద్ద ఉన్న ఉబ్బలమడుగు వాటర్ ఫాల్స్‌ను సందర్శించేందుకు అద్దె కారులో బయలుదేరారు. రాష్ట్ర సరిహద్దులోని పన్నంగాడు వద్ద అతివేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న టెంకాయ తోపులోకి దూసుకెళ్లింది. టెంకాయ చెట్టును వేగంగా ఢీకొనడంతో కారు నుజ్జునుజ్జు అయ్యింది. డ్రైవింగ్ చేస్తున్న మహ్మద్ అవాజ్ వెనుక కూర్చొన్న సండ్రీన్ ఫాతిమా(21) అక్కడికక్కడే మృతి చెందింది. మిగిలిన ఏడుగురికి తీవ్ర గాయాలవడంతో వారిని ఎలాఊరు ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి చెన్నైలోని స్టాండ్లీ ఆస్పత్రికి తరలించగా దీనదయాళ్(34) మృతి చెందాడు. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ కొండప్ప నాయుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సండ్రీన్ ఫాతిమా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

10న మిక్స్‌డ్ బియ్యం టెండర్ కమ్ వేలం

తిరుపతి(టీటీడి), మార్చి 23(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి భక్తులు సమర్పించిన మిక్స్‌డ్ బియ్యం టెండర్ కమ్ వేలం ఏప్రిల్ 10న తిరుపతిలోని మార్కెటింగ్ విభాగం కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు టీటీడీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. మొత్తం 12,320 కిలోల బియ్యం వేలానికి సిద్ధంగా ఉన్నాయని వెల్లడించింది. రూ.590 డీడీ తీసి టెండర్ షెడ్యూల్ పొందవచ్చునని పేర్కొంది. వేలంలో పాల్గొనేందుకు రూ.2,500 ఈఎండీగా చెల్లించాలని, వివరాలకు మార్కెటింగ్ కార్యాలయం ఫోన్ 0877 2264420కి లేదా టీటీడీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరింది.

శీగలపల్లెలో తాగునీటి బోరు



తాగునీటి బోరు పనులు ప్రారంభిస్తున్న రాజ్‌కుమార్ తదితరులు

కుప్పం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం 2వ వార్డు పరిధిలోని శీగలపల్లెలో ఆదివారం తాగునీటి బోరు వేశారు. ఈ పనులను ప్రారంభించిన టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సహకారంతో మున్సిపల్ ప్రజల తాగునీటి పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన ప్రాంతాల్లో తాగునీటి బోర్లు వేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి రవి, యూనిట్ ఇన్‌చార్జి ముత్తు, 2వ వార్డు బూత్ ఇన్‌చార్జి శ్రీరంగం, పార్టీ అధ్యక్షుడు నరసింహులు, రోహిత్, నవీన్, సుబ్రమణి, రామచంద్రప్ప, సత్యవేలు, ప్రశాంత్, జనసేన నాయకులు మంజునాథ్, సత్తివేలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అండగా ప్రభుత్వం

● మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు

శాంతిపురం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు అండగా ప్రభుత్వం నిలబడిందని మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో అస్తవ్యస్తమైన విద్యావ్యవస్థను ప్రభుత్వం గాడిన పెడుతోందని.. ప్రస్తుత ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని.. గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ వ్యవస్థను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ బకాయిలను కూటమి అధికారంలోకి రాగానే విడుదల చేసిందన్నారు. అందులో జనవరిలో రూ.788 కోట్లు, మార్చిలో రూ.600 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. త్వరలోనే మరో రూ.400 కోట్లు మంజూరు చేస్తుందన్నారు. విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ వివిధ కళాశాలల్లో నిలిచిపోయిన 10 లక్షల మంది విద్యార్థుల సర్టిఫికెట్లను విద్యార్థులకు అందించిందన్నారు. 'నేను ఉన్నా.. విన్నా' అంటూ జగన్ విద్యార్థుల కడుపుకొట్టారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సహకారంతో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాష్ట్రాన్ని నాలెడ్జ్ హబ్‌గా మార్చడమే లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. ఫీజులు కట్టక పోవడంతో విద్యార్థులకు నోటీసులు ఇప్పించిన ఘనత జగన్ దేనన్నారు. కొంత మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని.. ఐదేళ్ల జగన్ పాలనలో దగా పడిన విద్యార్థులకు ప్రస్తుతం ప్రభుత్వం అండగా నిలబడిందని వివరించారు.

ఘనంగా గంగజాతర వేడుకలు



ఊరేగుతున్న అమ్మవారు

సోమల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : కందూరులో గంగజాతర వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం అమ్మవారిని బాణసంచా వేడుకలతో ఊరేగింపుగా తీసుకొచ్చి నడివీధిలోని మండపం వద్ద ప్రతిష్ఠించారు. మహిళలు పొలిమేర అమ్మవార్ల ఆలయాల వద్దకు వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. పగడాలవారిపల్లె, బాలప్పగారిపల్లె, మిట్టపల్లె, ఊటుపల్లె తదితర గ్రామాల్లో జాతర వేడుకలతో సందడిగా మారింది.

ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న జనసేన నాయకులు

సోమల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగను పురస్కరించుకుని జనసేన నాయకులు ఎస్‌వీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో 10 రకాల నిత్యావసర వస్తువుల కిట్‌ను ఉచితంగా అందజేశారు. ఆదివారం స్థానిక ఏఎంసీ మార్కెట్ యార్డులో సోమల, కందూరు, నంజంపేట, పెద్దఉప్పరపల్లె తదితర గ్రామాలకు చెందిన 150 మంది ముస్లిం మహిళలకు కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన మండల పార్టీ అధ్యక్షుడు నాగభూషణం, నాయకులు డాక్టర్ హరినారాణ, కైవారం మురళీ, చాన్‌బాషా, రఘు, రామకృష్ణ, జాకీర్, షబ్బీర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న మానవహక్కుల సంఘం నేతలు

పలమనేరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : జాతీయ మానవహక్కుల సంఘం అవినీతి నిర్మూలన సంస్థ జిల్లా అధ్యక్షులు డీవీ మునిరత్నం సూచన మేరకు శనివారం రోడ్డుప్రమాదంలో మృతిచెందిన ఇంజనీరింగ్ విద్యార్థి కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని మానవ హక్కుల సంఘ నాయకులు ఆదివారం అందజేశారు. బైరెడ్డిపల్లి మండలం గాజీపేట గ్రామానికి చెందిన భువన్ వడమాలపేట మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో విద్యార్థి కుటుంబానికి తమవంతు ఆర్థికసాయం అందజేశామని మునిరత్నం తెలిపారు. కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం అనుబంధ సంఘం జిల్లా యూత్ అధ్యక్షులు సోమరాజు, మహిళా నాయకురాలు సరస్వతి, చంద్రకళ, జేఏసీ నాయకులు మురళీ పాల్గొన్నారు.

పుంగనూరు రచయితలకు విశిష్ట పురస్కారాలు



విశిష్ట సేవా పతకాలు అందుకుంటున్న కవులు

పుంగనూరు రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రచయితలకు ముందస్తు ఉగాది కవి సమ్మేళనం నిర్వహించి పుంగనూరు రచయితలకు విశిష్ట పురస్కారాలు అందజేసినట్లు రచయితల సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు నాగరాజ పరంకుశ తెలిపారు. ఆదివారం స్థానిక కొత్తయిండ్లు షిరిడి సాయిబాబా మందిరంలోని కళావేదికలో పుంగనూరు రచయితల సంఘం అధ్యక్షుడు నాగరాజ, తిరుపతి ప్రజా కళావేదిక సంఘ అధ్యక్షుడు అరవ జయపాల్ సంయుక్త అధ్యక్షతన కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పుంగనూరుకు చెందిన కవులు, రచయితల కవితలతో ఆకట్టుకున్నారు. పలువురు మాట్లాడుతూ కవులు ప్రతిభను కనబరిచి రాష్ట్ర స్థాయిలో పుంగనూరుకు మంచి పేరుప్రతిష్ఠలు తీసుకురావడం సంతోషకరమన్నారు. అనంతరం కవులు, రచయితలను ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథులు డాక్టర్ రెడ్డి కార్తీక్, విశ్రాంత డీఎస్పీ కె.సుకుమార్ బాబు, రిటైర్డ్ హెచ్‌ఎం సరస్వతమ్మ, అడ్వకేట్ శ్రీనివాసులు సేవలను గుర్తించి విశిష్ట సేవారత్న అవార్డులు అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు, కవులు వెంకటపతి, పార్థసారథిరావు, రామలింగప్ప, హసినాబేగం, సతీశ్‌కుమార్‌రాజు, తల్లా శ్రీనివాసులు, జీఆర్. మురళీ స్రవంతి, జమున, హేమలత, రహత్‌జాన్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు

కుప్పం/పుంగనూరు

ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి సన్మానం



ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని సన్మానిస్తున్న ప్రింట్ మీడియా కార్యవర్గ సభ్యులు

పలమనేరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ప్రింట్ మీడియా నూతన కార్యవర్గం ఆదివారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని పార్టీ కార్యాలయంలో కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రింట్ మీడియా నూతన అధ్యక్షులు శ్యామ్, ప్రధాన కార్యదర్శి దిలీప్ , సభ్యులు పూల మోహన్, రెడ్డెప్ప పాల్గొన్నారు.

అమరనాథరెడ్డిని కలిసిన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు

పలమనేరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పలమనేరు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎల్. భాస్కర్ ఆదివారం బార్ అసోసియేషన్ సభ్యులతో కలిసి మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని ఆయన కార్యాలయంలో కలిశారు. గత రెండు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎల్.భాస్కర్‌ను ఎమ్మెల్యే సన్మానించి అభినందించారు.

● పలమనేరు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఎల్.భాస్కర్‌ను ఆదివారం బీసీ సంఘాల నేతలు ఆయన కార్యలయంలో కలిసి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీసీ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.కృష్ణమూర్తి, వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు పొదల నరసింహులు, బహుజన హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు గంపల గంగరాజు, వీఆర్.ఎస్ రాష్ట్ర కార్యదర్శి మేకల విజయ్‌మోహన్, వాల్మీకి సంఘ నాయకులు బి.లక్ష్మన్న , టి.మంజునాథ్, కొటికి శేఖర్, ఎం.నరసింహులు, బాలాజీ పాల్గొన్నారు.

కడా గ్రీవెన్స్ డే వాయిదా

కుప్పం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండల సచివాలయంలో సోమవారం కడా పీడీ వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక అనివార్య కారణాలతో వాయిదా వేస్తున్నట్లు కార్యాలయ అధికారులు తెలిపారు. ఈ విషయాన్ని నియోజకవర్గ ప్రజలు గుర్తించి సోమవారం కార్యాలయానికి రావొద్దని కోరారు.

బోయకొండ గంగమ్మకు పంచామృతాభిషేకం



చౌడేపల్లె, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో గంగమ్మ నామస్మరణతో మార్మోగింది. ఆదివారం ఉదయాన్నే ఆలయ అర్చకులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా స్వర్ణాభరణాలతో అలంకరించారు. భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఈవో ఏకాంబరం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దండుపాళ్యం గంగమ్మ ఆలయంలో చల్లా పూజలు



దండుపాళ్యం ఆలయంలో మొక్కులు తీర్చుకుంటున్న చల్లా

పుంగనూరు రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం రాగానిపల్లె పంచాయతీ దండుపాళ్యంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయంలో ఆదివారం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో గంగమ్మ అమ్మవారిని ప్రతిష్ఠించి 41 రోజులు పూర్తి కావడంతో వేదపండితులు ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాము, టీడీపీ నాయకులు మాధవరెడ్డి, సీవీరెడ్డి, శ్రీకాంత్, శమీపతి, సుబ్రహ్మణ్యంరాజు, గంగాధర్, చలపతినాయుడు, మోహన్‌రెడ్డి, గంగరాజు, గిరిబాబు. రవినాయుడు, చైతన్యరాయల్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై ఎమ్మార్పీఎస్ సంబరాలు



అంబేడ్కర్‌కు నివాళులు అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బైరెడ్డిపల్లె, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో ఆమోదం తెలపడంపై బైరెడ్డిపల్లెలో ఆదివారం ఎమ్మార్పీఎస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేడ్కర్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణమాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి పూజలు నిర్వహించారు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న తమ ఆశలకు అనుగుణంగా ఎస్సీ వర్గీకరణ జరగడంపై సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

● చల్లా రామచంద్రారెడ్డి



సామూహిక నమాజ్‌లో పాల్గొన్న చల్లా రామచంద్రారెడ్డి

కల్లూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు దిగువవీధిలోని ఆయేషా మసీదులో ఆదివారం ముస్లిం సోదరులు ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందుకు చల్లా రామచంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా చల్లా మాట్లాడుతూ నెల రోజుల ఉపవాసం ఉండి భక్తిశ్రద్ధలతో ఆరాధించే ముస్లిం సోదరులకు అల్లా ఆశీస్సులు ఉండాలన్నారు. చల్లా రామచంద్రారెడ్డికి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ముస్లిం మతపెద్దలు ప్రార్థనలు చేశారు. రాష్ట్ర కురుబ కార్పోరేషన్ డైరెక్టర్ రమణ, టీడీపీ నాయకులు రామనాథంనాయుడు, మురళీధర్, వెంకటరమణ, ధనంజయనాయుడు, మురళీధర్‌నాయుడు, టీడీపీ మైనారిటీ నాయకులు షకూర్, నూర్‌బాషా, ఖాదర్‌వల్లి, అబ్బాస్, అష్రఫ్, అల్తాఫ్, ఇమ్రాన్, అబ్బాస్, బారేషావల్లి, బాబి, సర్దార్‌బాషా, అన్సర్‌బాషా, అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

దర్జాగా.. కబ్జా..!



● విచ్చలవిడిగా ప్రభుత్వ భూముల ఆక్రమణ

● జోరుగా విక్రయాలు ● పట్టించుకోని ప్రభుత్వ అధికారులు



ఆక్రమణలో వీరప్పకుంట



పుంగనూరులో ఆర్‌అండ్‌బీ అధికారులు గతంలో ఏర్పాటు చేసిన బోర్డు

పుంగనూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు పరిసర ప్రాంతాల్లో భూములకు విపరీతంగా ధరలు పెరగడంతో ప్రభుత్వానికి చెందిన ఖాళీ స్థలం, వంకలు, చెరువులు ఏది కనిపించినా దర్జాగా కబ్జాలు చేస్తున్నా సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. వీఆర్వో నుంచి తహసీల్దార్, ఆర్డీవో, జేసీ, కలెక్టర్‌వరకు ఫిర్యాదులు వెళ్లినా పుంగనూరులో ప్రభుత్వ ఆస్తులు కాపాడటంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. పట్టణ శివార్లలోని కాలనీల్లో అయితే ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు స్థలాలు ఆక్రమించి లక్షలాది రూపాయలకు ఇష్టారాజ్యంగా అమ్ముకుంటున్నారు. పుంగనూరు సమీపంలోని భీమగానిపల్లె వద్ద మదనపల్లె రోడ్డు సమీపంలో కోట్లు విలువచేసే స్థలాన్ని వైసీపీ నాయకులు రియల్‌ఎస్టేట్ వ్యాపారాల కోసం చెరువులను సైతం ఆక్రమించి చదును చేసి విక్రయాలు చేస్తున్నా .. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. వీరప్పకుంట కాల్వను చదును చేసి ప్లాట్లు వేస్తున్నట్లు గ్రామస్తులు గతంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో స్పందించి కుంట చుట్టూ ట్రెంచ్ ఏర్పాటు చేయాలని ఆదేశించగా అధికారులు ఎక్స్‌కవేటర్‌తో ట్రెంచ్ ఏర్పాటు చేశారు. అయితే స్థానిక వైసీపీ నాయకులు మళ్లీ రాత్రికిరాత్రే కాల్వను చదును చేయడంతో గ్రామస్తులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. పక్కనే ఉన్న గుట్ట, ప్రభుత్వ భూములను చదును చేసి రియల్‌ఎస్టేట్ వ్యాపారాలకు సిద్ధం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమించిన కుంట, గుట్ట, ప్రభుత్వ భూములను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

అలాగే పట్టణంలోని మదనపల్లె రోడ్డులో దాదాపు రూ.కోటి విలువైన రోడ్డు భవనాలశాఖకు చెందిన స్థలాన్ని పలుమార్లు ఆక్రమణదారులు దురాక్రమణకు ప్రయత్నించగా స్థానికుల ఫిర్యాదులతో వీలుకాలేదు. గతంలోనే ఆ స్థలం ఆర్‌అండ్‌బీకి చెందిందని హెచ్చరిక బోర్డు పెట్టినా విలువైన స్థలం కాజేయాలని పలువురి కన్నుపడింది. కొంతకాలంగా టెంకాయల వ్యాపారం కోసం గుడిసె వేసి అలాగే ఆక్రమించే ప్రయత్నాలు సాగుతున్నాయి. దీనిపై ఆర్‌అండ్‌బీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. దీనిపై శనివారం పుంగనూరుకు చెందిన బీజేపీ నాయకులు పి.అయూబ్‌ఖాన్, నరసింహులు తదితరులు ఆర్‌అండ్‌బీ స్థలాన్ని పరిశీలించారు. పుంగనూరులో కోట్లు విలువచేసే వంకలు, కాల్వలు, ప్రభుత్వ స్థలాలు, చెరువులు ఆక్రమణలకు గురైనట్లు స్వయానా జిల్లా కలెక్టర్‌కే ఫిర్యాదులు చేసినా .. పలుమార్లు పత్రికల్లో కథనాలు ప్రచురితమైనా ఏమాత్రం అధికారుల నుంచి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా కోరల నుంచి అధికారులు కాపాడకుంటే బీజేపీ ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణ భూముల్లో సర్వే చేయించి కాపాడాలని కోరారు.

ఆక్రమణలపై సర్వే చేయించి చర్యలు తీసుకుంటాం

పుంగనూరు పట్టణ, పరిసర ప్రాంతాల్లో ఆక్రమణల్లో ఉన్న ప్రభుత్వ స్థలాలు, చెరువుల్లో వెంటనే సర్వే నిర్వహించి చర్యలు తీసుకుంటాం. సోమవారం రెవెన్యూ అధికారులు, సర్వేయర్‌తో వెళ్లి ఆక్రమణ స్థలాలను పరిశీలిస్తాం. ప్రభుత్వ స్థలాలు, వంకలు, చెరువులు ఆక్రమించడం నేరం. ఆ స్థలాలను స్వాధీనం చేసుకుంటాం.



- రాము, తహసీల్దార్ పుంగనూరు

సభ్యత్వం తీసుకున్న అందరికీ గుర్తింపు కార్డులు

ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



సభ్యత్వ గుర్తింపు కార్డులను అందజేస్తున్న అమరనాథరెడ్డి

పలమనేరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకొన్న వారందరికీ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన గుర్తింపు కార్డులను అందజేయాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి కోరారు. ఆదివారం పలమనేరు టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ బూత్ కమిటీ , గ్రామ కమిటీ, మండల పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో నియోజకవర్గంలోని పలమనేరు మున్సిపాలిటీ, పలమనేరు, గంగవరం, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లి, వి.కోట మండలాల నుంచి వచ్చిన మండల, యూనిట్ నాయకులకు వారివారి పరిధిలోని సభ్యత్వం తీసుకొన్న సభ్యుల గుర్తింపు కార్డులను అందజేశారు. అమరనాథరెడ్డి మాట్లాడుతూ సభ్యత్వం తీసుకొన్న ప్రతిఒక్కరికీ తప్పనిసరిగా పార్టీ గుర్తింపు కార్డు అందజేయాల్సిన బాధ్యతను ఆయా బూత్‌కమిటీ, యూనిట్ సభ్యులు తీసుకోవాలని కోరారు. పలమనేరు నియోజకవర్గంలో పేదల ఇళ్ల కోసం దాదాపు 14 వేల దరఖాస్తులను పార్టీ నాయకులు ఇప్పటికే అందజేశారని.. అందులో అర్హత కలిగిన వారిని గుర్తించి వారి ఆదాయం, అనుభవ స్థలం సర్టిఫికేట్లను రెవెన్యూ కార్యాలయాల నుంచి తీసుకొని వాటిని అర్హులైన లబ్ధిదారుల దరఖాస్తులకు పొందుపరచి హౌసింగ్ అధికారులకు చేర్చాల్సిన బాధ్యత పార్టీ నాయకులపై ఉందన్నారు. గత ప్రభుత్వం మంజూరు చేసి అసంపూర్తిగా ఉన్న ఇళ్లకు సైతం ప్రభుత్వం బిల్లులు మంజూరు చేస్తుందని తెలిపారు. స్థానిక సంస్థలను ముఖ్యంగా పంచాయతీలను గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని.. గత ఐదేళ్ల పంచాయతీలకు నిధులు విడుదల చేయకుండా పక్కదారి పట్టించిందన్నారు. ప్రభుత్వం రాగానే పంచాయతీలకు 14, 15 ఆర్థిక సంవత్సరం నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో తెలుగుదేశం మద్దతుదారులే గెలుపొందేలా పనిచేయాలని కోరారు. సమావేశంలో మండలాల టీడీపీ నాయకులు ఆర్వీ బాలాజీ రంగనాథ్, రామచంద్రనాయుడు, కిషోర్‌గౌడు, ఆర్పీసీ కుట్టి, నాగరాజరెడ్డి పెద్దబ్బ, సోమశేఖర్‌గౌడు, పలువురు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టెంకాయ కొట్టేదెప్పటికో..!

● ప్రారంభం కాని మున్సిపల్ కార్యాలయ భవనం



నూతన మున్సిపల్ కార్యాలయ భవనం



ప్రస్తుతం మున్సిపల్ కార్యాలయం నడుస్తున్న భవనం

కుప్పం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కుప్పం మున్సిపల్ కార్యాలయానికి సొంత భవనం లేక ఏళ్లు గడుస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో కుప్పం మేజర్ పంచాయతీ చుట్టూ ఉన్న 8 పంచాయతీలను కలుపుకుని మున్సిపాలిటీగా మారింది. పాత పంచాయతీ భవనంలోనే నూతన మున్సిపల్ కార్యాలయ భవనం నడుస్తూ ఉండేది. నూతన భవనం నిర్మించాలని ఇక్కడి పాత భవనాన్ని అప్పట్లోనే కూలగొట్టారు. కుప్పం పట్టణం ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఒకప్పటి ద్రావిడ విశ్వవిద్యాలయం క్యాంపస్ భవనంలోకి మున్సిపల్ కార్యాలయాన్ని మార్చారు. చాలీచాలని ఇరుకు గదుల్లోనే ప్రస్తుతం మున్సిపల్ కార్యాలయం నడుస్తోంది. మున్సిపాలిటీకి చెందిన ట్రాక్టర్లు, ఇతర వాహనాలు వంటివి పార్కింగ్ చేసుకోవడానికి తగిన స్థలం లేదు. ఇటీవల పూల మార్కెట్ వద్ద పార్కింగ్ చేసి ఉన్న మున్సిపల్ ట్రాక్టర్‌ను అవుట్ సోర్సింగ్ సిబ్బంది చోరీ చేసి వి.కోట వరకు తీసుకెళ్లి, తిరుగు ప్రయాణంలో ప్రమాదానికి గురిచేసిన విషయం తెలిసిందే. మరోవైపు నూతన భవన నిర్మాణాన్ని అప్పట్లోనే ప్రారంభించినా, పనులు నత్తనడకన సాగాయి. వైసీపీ హయాం ముగిసే వరకు ఈ పనులు సాగుతూనే ఉన్నాయి. అయినా భవన నిర్మాణం పూర్తి కానేలేదు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భవన నిర్మాణ పనుల్లో వేగం పెరిగింది. ప్రస్తుతం నిర్మాణం దాదాపు పూర్తయి పెయింటింగ్ దశలో ఉంది. అయితే ఎందుకో పనుల్లో జాప్యం జరుగుతోంది. మరోవైపు పంచాయతీ సిబ్బందితోనే నడుస్తున్న కుప్పం మున్సిపాలిటీకి 44 కొత్త పోస్టులు ప్రభుత్వం మంజూరు చేసింది. వీరంతా ఇంకా విధుల్లో చేరలేదు. ఒకవేళ చేరితే మున్సిపల్ కార్యాలయం ప్రస్తుతం నడుస్తున్న యూనివర్శిటీ క్యాంపస్ భవనం ఏమాత్రం సరిపోక ఇబ్బందులు తలెత్తుతాయి. తుది దశలో ఉన్న అరొకరా పనులు సైతం వెంటనే పూర్తి చేసి నూతన మున్సిపల్ కార్యాలయ భవనం వెంటనే ప్రారంభించాలని మున్సిపల్ సిబ్బందితో పాటు ప్రజలు కోరుతున్నారు.

సెల్వంకు మున్సిపల్ చైర్మన్‌గా అవకాశం ఇవ్వాలి


- వన్నెకుల క్షత్రియ ఆత్మీయ సమావేశంలో తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం.రాజు

కుప్పం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కుప్పం మున్సిపల్ చైర్మన్‌గా మున్సిపాలిటీ ఐదో వార్డు కౌన్సిలర్ సెల్వంకు అవకాశం ఇవ్వాలని కుప్పం నియోజకవర్గ వన్నెకుల క్షత్రియ ఆత్మీయ సమావేశంలో తీర్మానించారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం వన్నెకుల క్షత్రియ నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం మున్సిపల్ అధ్యక్షునిగా పోటీ చేసి ఓడిన త్రిలోక్‌కు అవకాశం ఇవ్వని పక్షంలో సెల్వంను చైర్మన్ పదవికి ఎన్నుకోవాలని సమావేశంలో కులపెద్దలు కోరారు. సుదీర్ఘకాలంగా టీడీపీకి వెన్నుదన్నుగా నిలుస్తున్న వన్నెకుల క్షత్రియ కులానికి చెందిన సెల్వానికి చైర్మన్‌గా అవకాశం ఇవ్వడమే కాకుండా తమ కులస్తులకు కడా చైర్మన్‌గా గాని.. ఎమ్మెల్సీగా గాని అవకాశం కల్పించాలని తీర్మానం చేశారు. అలాగే వన్నెకుల క్షత్రియులకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి, కులస్తుల అభివృద్ధికి దోహదపడాలని కోరారు. సమావేశంలో వన్నెకుల క్షత్రియ రాష్ట్ర సాధికార సమితి కన్వీనర్ జీఎం.రాజు, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాణిపాకం వెంకటేశ్, ఐదో వార్డు కౌన్సిలర్ సెల్వం, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్లు వేణు, అరుణాచలం, వామనమూర్తి, జనసేన నియోజకవర్గ వన్నెకుల క్షత్రియ అధ్యక్షుడు రుద్రప్ప, ప్రధాన కార్యదర్శి అశోక్, మణి, వెంకీ, సతీశ్, వన్నెకుల క్షత్రియ కులపెద్దలు, యువత తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ డాక్యుమెంట్ రైటర్ మృతి



రెడ్డెప్ప (ఫైల్ ఫొటో)

పలమనేరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద గత మూడు దశాబ్దాలుగా డాక్యుమెంట్ రైటరుగా ఉన్న రెడ్డెప్ప(69) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. అందరితో సౌమ్యుడిగా పేరు తెచ్చుకొన్న రెడ్డెప్ప అకాల మృతి పట్ల స్థానికులు ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తున్నారు. ఆయన దహనక్రియలు గంగవరం మండలం కొత్తపల్లి గ్రామంలో 24న సోమవారం నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సదుమమ్మకు పొంగళ్లు

సదుం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సదుం గంగమ్మ జాతరలో భాగంగా ఆదివారం స్థానిక గ్రామ దేవత సదుమమ్మకు ప్రజలు పెద్దఎత్తున పొంగళ్లు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు, అభిషేకాలు నిర్వహించారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

ముస్లింల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

● ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్,



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, చుడా ఛైర్ పర్సన్ కఠారి హేమలత తదితరులు

చిత్తూరు కల్చరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. ఆదివారం నగరంలోని గంగనపల్లె మసీదులో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ముస్లింల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు చేపట్టిందని, వాటిని సద్వినియోగం చేసుకుని, చిత్తూరు నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం ఆయన చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలతతో కలిసి ఇఫ్తార్ విందు ఆరగించారు. ప్రభుత్వ ఖాజీ కమాలుల్లా జుహారి, డివిజన్ ఖాజీ, నగరపాలక మేయర్ అముద, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

తల్లికి మించిన దైవం లేదు

● ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు



పైనేని మునెమ్మ స్మారక పురస్కార గ్రహీతలతో నిర్వాహకులు

శ్రీరంగరాజపురం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): తల్లికి మించిన దైవం ఏదీ లేదని ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు అన్నారు. ఆదివారం ఆరిమాకుపల్లె కళా ప్రాంగణంలో పైనేని మునెమ్మ స్మారక పురస్కార ప్రదాన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు మాట్లాడుతూ తల్లిని పూజించగలిగిన వాడే భార్యను ప్రేమించగలడన్నారు. శతావధాని ఆముదాల మురళి మాట్లాడుతూ సమాజాన్ని ఉత్తమంగా తీర్చిదిద్దడానికి తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కథల పోటీల్లో గెలుపొందిన రోహిణి వంజారి(హైదరాబాద్), డాక్టర్ సుగుణరావు(విశాఖపట్టణం), ప్రకాశరావు(తిరుత్తణి), నర్సిరెడ్డి(అనంతపురం), అరుణకుమారి(చిత్తూరు), సీతారామరాజు(కాకినాడ), డాక్టర్ కోటేశ్వరరావు(కరీంనగర్), సింహప్రసాద్(హైదారాబాద్), మౌని(తిరుపతి)లను నగదు పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష, కార్యదర్శులు పైనేని తులసినాథ నాయుడు, పుష్ప, కోశాధికారి పైనేని మురళి, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, ఆనందబాబు, నరేంద్ర, యుగంధర్, విజేంద్ర నాయుడు, కాంతమ్మ, రమ్య, రేణుక, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



మునస్వామి చిత్రపటానికి ఎమ్మెల్యే భానుప్రకాష్ నివాళి

నగరి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని టి.ఆర్.కండ్రిగలో వ్యృతి చెందిన టీడీపీ నేత కేశవులు తల్లి మునెమ్మ మృతదేహానికి ఆదివారం ఎమ్మెల్యే భానుప్రకాష్ పూలమాలవేసి నివాళులర్పించారు. నగరి మండల పరిధిలోని దామరపాకంలో రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యదర్శి బాలాజీ సమీప బంధువు, దామరపాకం పంచాయతీ టీడీపీ ప్రధానకార్యదర్శి అన్నాదొరై మామ మృతిచెందడంతో ఆదివారం జరిగిన కర్మక్రియలలో ఎమ్మెల్యే పాల్గొని నివాళులర్పించారు. అనంతరం ఏ.ఎస్.కండ్రిగలో ఇటీవల ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడిన టీడీపీ కార్యకర్త దివాకర్‌ను పరామర్శించారు. గ్రామంలో పర్యటించి సమస్యల పరిష్కారానికి అధికారులతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి శంకరయ్య సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న సీడబ్ల్యుసీ ప్రత్యేక ఆహ్వానితులు రుద్రరాజు

వెదురుకుప్పం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోటుగారి శంకరయ్య పార్టీకి చేసిన సేవలు మరువలేనివని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు రుద్రరాజు అన్నారు. సీనియర్ కాంగ్రెస్ నేత, డీసీసీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ తండ్రి శంకరయ్య(75) ఇటీవల వెదురుకుప్పం మండలం బలిజమొండివెంగనపల్లెలో మరణించారు. ఆదివారం శుభస్వీకరణ కార్యక్రమం జరిగింది. రుద్రరాజు సహా పలువురు కాంగ్రెస్ నాయకులు ఆ గ్రామానికి చేరుకుని శంకరయ్య మృతి పట్ల సంతాపం ప్రకటించి, డీసీసీ అధ్యక్షుడిని పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ వెదురుకుప్పం మండల అధ్యక్షుడు కందుకూరి హుమేష్, జిల్లా ఇన్‌చార్జి రాంభూపాలరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన సీకేబీ క్రికెట్ టోర్నమెంట్



గొంతు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న హర్షిత తల్లిదండ్రులకు నగదును అందిస్తున్న సీకేబాబు, కెల్విన్‌బాయ్స్ టీము సభ్యులు

చిత్తూరు అర్బన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): గత 20 రోజులుగా పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో జరిగిన సీకేబీ క్రికెట్ టోర్నమెంటు ఆదివారం ముగిసింది. ముగింపు సమావేశానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత సీకేబాబు విజేతలకు నగదు బహుమతులను అందించారు. మొదటి బహుమతిని గెలుచుకున్న కెల్విన్‌బాయ్స్ టీముకు రూ.లక్ష, రెండవ బహుమతిని గెలుచుకున్న గలాటా బాయ్స్ టీముకు రూ.50వేలు, మూడో బహుమతిని సీవీఆర్ బాయ్స్‌కు రూ.25వేలను అందించారు. కాగా గొంతు సంబంధిత వ్యాధితో ఇబ్బంది పడుతున్న యాదమరి మండలం కీనాటంపల్లెకు చెందిన హర్షిత తల్లిదండ్రులకు మొదటి బహుమతిగా వచ్చిన రూ.లక్షను కెల్విన్‌బాయ్స్ టీము సభ్యులు సీకేబాబు చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంటు నిర్వాహకులు హేమంత్, శివ, మాజీ కార్పొరేటర్ మురళీ, క్రీడాకారులు పాల్గొన్నారు.

కాలెప్ప కుటుంబానికి అండగా ఉంటాం

గుడిపాల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి దళితవాడకు చెందిన వైసీపీ సీనియర్ నేత కాలెప్ప కుటుంబానికి అండగా ఉంటామని చిత్తూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త విజయానందరెడ్డి అన్నారు. ఆదివారం కాలెప్ప చిత్రపటానికి ఆయన నివాళులర్పించారు. మండల వైసీపీ అధ్యక్షుడు ప్రకాష్, ఎంపీపీ ప్రసాద్ రెడ్డి, వసంతాపురం సర్పంచ్ రజనీకాంత్, నగర వైసీపీ అధ్యక్షుడు కేపీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణులకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనారాయణులు

గంగాధరనెల్లూరు మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వేపంజేరిలో వెలసిన లక్ష్మీనారాయణులకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చన పూజలు నిర్వహించారు. భక్తులు లక్ష్మీనారాయణస్వామి, అష్టలక్ష్మి ఆలయాలతో పాటు కోనేటివద్ద గల పలు ఆలయాలను సందర్శించి పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. ఈనెల 25వ తేదీన శ్రవణం తిరు నక్షత్రం సందర్భంగా వెంకటేశ్వర పెరుమాళ్‌కు అభిషేకం పూజలు జరగనున్నట్లు ఆలయట్రస్టీ కె.ఎస్. వాసు ఓ ప్రకటనలో తెలిపారు.ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, అర్చకులు విష్ణుస్వామి, గోవిందస్వామి, ద్వివేది, గౌరీష్, భక్తులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ



టీడీపీ సభ్యత్వ కార్డులతో ఒకటో వార్డు తెలుగు మహిళలు

నగరి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీలోని ఒకటో వార్డులో తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకున్నవారికి ఆదివారం రామానుజం చలపతి, మాజీ కౌన్సిలర్ లతలు సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. ఒకటో వార్డులో పార్టీ ఉనికి, శ్రేయస్సు కోసం కష్టపడి పనిచేసేవారికి తామే రుసుము చెల్లించి సభ్యత్వ నమోదు చేయించామని వారు తెలిపారు.

25న ప్రత్యేక విద్యుత్ అదాలత్

వెదురుకుప్పం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికగా కార్వేటినగరంలో ఈ నెల 25వ తేది మంగళవారం నిర్వహిస్తున్న ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎస్పీడీసీఎల్ చిత్తూరు రూరల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎస్.సురేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం కార్వేటినగరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కార్వేటినగరం సబ్ డివిజన్ ఆఫీసు ఆవరణలో గంగాధరనెల్లూరు, కార్వేటినగరం, నగరి సబ్ డివిజన్ పరిధిలోని సెక్షన్లకు సంబంధించి ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థకు చెందిన అధికారులు, సిబ్బంది ఈ అదాలత్‌కు హాజరుకానున్నారని తెలిపారు. విద్యుత్ వినియోగదారులకు సంబంధించి పరిష్కారం కాని సమస్యలను రాత పూర్వకంగా ఫిర్యాదు ద్వారా తెలియజేసి పరిష్కరించుకోవాలని కోరారు. ఆయన వెంట ఏడీఈ చంద్రబాబు ఉన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా సునీల్‌కుమార్ ఆచారి



ఐరాల(కాణిపాకం), మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఐరాల మండల బీజేపీ అధ్యక్షుడిగా సునీల్ కుమార్ ఆచారిని నియమించినట్లు ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కె.చంద్రమోహన్ తెలిపారు. ఆదివారం కాణిపాకంలోని బీజేపీ కార్యాలయంలో మండల పార్టీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆయన చెప్పారు. ప్రధాన కార్యదర్శులుగా సి.అశోక్, టి.గుణశేఖర్, ఉపాధ్యక్షులుగా పీఎస్.ప్రేమ్‌నాథ్, ఐ.మోహన్‌రెడ్డి, బి.అనూరాధ, ఎస్.రామమూర్తి, కె.తులసిలను నియమించినట్లు ఆయన తెలిపారు. సునీల్ కుమార్ ఆచారి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి భానుప్రకాష్, ఐరాల మండల మాజీ అధ్యక్షుడు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరపాలక కార్యాలయంలో 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ నరసింహ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయ ఆవరణంలో జరిగే ఈ కార్యక్రమంలో బాధిత ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామని తెలిపారు. అధికారులంతా తప్పక హాజరుకావాలని ఆయన ఆదేశించారు.


సారా విక్రేత అరెస్టు

చిత్తూరు అర్బన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): అక్రమంగా సారా కలిగివున్న ఓ మహిళను రెండో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. సీఐ నెట్టికంఠయ్య కథనం మేరకు.. నగరంలోని తేనెబండలో గౌరి అనే మహిళ సారాను ఇంట్లో పెట్టుకుని విక్రయిస్తోందని పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు వారు ఆదివారం గౌరి ఇంట్లో దాడి చేసి ఆమె వద్ద నుంచి నాలుగు లీటర్ల విలువైన 40 సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బంగారుపాళ్యం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి మొగిలి ఘాట్ సమీపంలోని శ్రీనిఫుడ్ పార్క్ ఎదురుగా ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇద్దరు వ్యక్తులు గాయపడినట్లు సీఐ కత్తిశ్రీనివాసులు తెలిపారు. సీఐ కథనం మేరకు... తిరువళ్లూరుకు చెందిన మనోజ్, చెన్నైకు చెందిన వేలు ద్విచక్ర వాహనంపై పలమనేరు వైపు వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో వెనుకవైపు నుండి ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో మనోజ్, వేలు తీవ్రంగా గాయపడటంతో 108 వాహనం ద్వారా బంగారుపాళ్యం ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సంపూర్ణ అక్షరాస్యతే ధ్యేయం



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏపీఎం సుధారాణి

గుడిపాల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ అక్షరాస్యతే ప్రభుత్వ ధ్యేయమని ఏపీఎం సుధారాణి అన్నారు. ఆదివారం మండలంలోని కొత్తపల్లిలో జరిగిన ఉల్లాస్ పరీక్ష కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని 20 కేంద్రాల్లో 196 మంది నిరక్షరాస్య మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు గత 30 రోజులుగా శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. వీరిలో ప్రతిభను వెలికితీసేందుకు ఈ పరీక్షలు నిర్వహించినట్లు ఆమె చెప్పారు. కార్యక్రమంలో వెలుగు సీసీ లోకనాథరెడ్డి, సంఘమిత్రలు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలెక్కడ?

● పేదల ప్రాణాలను బలిగొంటున్న వైనం

● వీధిన పడుతున్న కుటుంబాలు



ఎస్ఆర్‌పురం మండలం పొదలపల్లి సమీపంలో ప్రమాదానికి గురైన ట్రాక్టర్ (ఫైల్‌ఫొటో)

వెదురుకుప్పం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్ల తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. పేదల ప్రాణాలను బలిగొనడమే కాకుండా చాలా మంది క్షతగాత్రులై ఆస్పత్రి పాలవుతున్నారు. దివ్యాంగులుగా మారిపోతున్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని పేదలు ఈ ప్రమాదాల్లో బలైపోతున్నారు. జనాలను తరలించడానికి అనుమతి లేని వాహనాల్లో రోడ్డు నిబంధనలకు విరుద్ధంగా శుభ, అశుభ కార్యక్రమాలకు ఆయా వాహనాలను ఆశ్రయించడమే కారణం. ముందస్తుగా సంబంధిత యంత్రాంగం ప్రజలకు అవగాహన కల్పించి ఆ తర్వాత ప్రయాణికులను తరలించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటే కొంత మేర ప్రమాదాలు జరగకుండా కట్టడి చేయవచ్చు. కానీ, గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఆ పరిస్థితి కనిపించడం లేదని తెలుస్తోంది. ఇందుకు ఎస్ఆర్‌పురం మండలంలో ఇటీవల జరిగిన రెండు ప్రమాదాలే నిలువెత్తు నిదర్శనం. ప్రయాణికులను చేరవేయడానికి ఉపయోగించాల్సిన వాహనాలను కాకుండా ఇతరత్రా వాహనాల్లో వారిని తరలించడం. జరగరాని ప్రమాదం ఘటనలు చోటు చేసుకున్న సమయాల్లో పేదలు గాయపడటం, ప్రమాణాలు కోల్పోవడం జరుగుతూ ఉంది. ఉదాహరణకు ఈ ఏడాది ఫిబ్రవరి 3వ తేదిన గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని ఎస్ఆర్‌పురం మండలం పాతపాళ్యం కాలనీకి చెందిన కొందరు లగేజీ వ్యానులో బయలుదేరి గంగాధరనెల్లూరు మండలం ఎట్టేరి గ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో ఎస్ఆర్‌పురం మండలం పుల్లూరు క్రాస్ రోడ్డు సమీపంలోని సిద్ధమనాయుడు మ్యాంగో గార్డెన్ వద్దకొచ్చేసరికి వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లగేజీ వ్యానులో ప్రయాణిస్తున్న తాపీ మేస్త్రీ వెంకటేష్(35) అక్కడికక్కడే మరణించాడు. పలువురు గాయపడ్డారు. వీరంతా కూడా ఎస్సీకాలనీకి చెందిన పేదలే. తాజాగా గంగాధరనెల్లూరు మండలం బాలగంగనపల్లె(అరసేనుపల్లె)లో చిన్నక్క (70) అనే వృద్ధురాలు మృతి చెందడంతో శుక్రవారం వెదురుకుప్పం మండలం యనమలమంద ఎస్సీ కాలనీకి చెందిన 40 మందికి పైగా మహిళలు ఓ ట్రాక్టరులో బయలుదేరి అంత్యక్రియలకు వెళ్లారు. అంత్యక్రియలకు వెళ్తొస్తుండగా ఎస్ఆర్‌పురం మండలం పొదలపల్లి వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో యనమలమంద ఎస్సీ కాలనీకే చెందిన 37 మంది పేద మహిళలే గాయపడ్డారు. వారంతా ప్రస్తుతం వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో స్పందించడం కన్నా ముందస్తుగా ప్రజల్లో అవగాహన కల్పించి ప్రయాణికులను తరలించకూడని వాహనాల్లో తరలించరాదని, అవగాహన కల్పించడం, జరిమానాలు విధించడం, కేసులు నమోదు చేయడం వంటివి జరిగి ఉంటే ఇలా అయి ఉండకపోవచ్చునని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఇప్పటికైనా నియోజకవర్గంలో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

విద్యార్థులకు అండగా చంద్రబాబు ప్రభుత్వం



మీడియాతో మాట్లాడుతున్న సురేంద్రకుమార్

చిత్తూరు సిటీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అండగా చంద్రబాబు ప్రభుత్వం ఉంటుందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ అన్నారు. గత వైసీపీ పాలనలో మాజీ సీఎం జగన్ విద్యా వ్యవస్థను నాశనం చేశారని ధ్వజమెత్తారు. విద్యార్థులను నిర్లక్ష్యం చేసి సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు నిధులు చెల్లించకుడా ఇబ్బందులకు గురిచేశారని అన్నారు. దీంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు హాల్ టికెట్‌లు, సర్టిఫికెట్లు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని చెప్పారు. జగన్ గద్దె దిగే నాటికి రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.2,832 కోట్లు, వసతి దీవెన బకాయిలు రూ.989 కోట్లు, పీజీ ఫీజు బకాయిలు రూ.450 కోట్లు, మొత్తం రూ.4,271 కోట్ల బకాయి పెట్టి వెళ్లారని చెప్పారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యావ్యవస్థలో మార్పులు తీసుకువచ్చారని అన్నారు. అందులో భాగంగా ఫీజు బకాయిలను క్రమబద్ధీకరించడానికి చర్యలు తీసుకొని జనవరిలో రూ.788 కోట్లు, మార్చిలో ఇటీవల రూ.600 కోట్లు విడదల చేసినట్లు చెప్పారు. మరో రూ.400 కోట్లను త్వరలో విడుదల చేయనున్నారని అన్నారు. విద్యార్థులకు ఎప్పుడూ ప్రభుత్వ అండగా ఉంటుందని, విద్యార్థులు కూడా వాస్తవాలు గ్రహించి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.

ఘనంగా ముందస్తు ఉగాది వేడుకలు



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్, పక్కన కేశవులు నాయుడు

చిత్తూరు కల్చరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రానున్న విశ్వావసు నామ సంవత్సర ఉగాది ముందస్తు వేడుకలు నగర కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా జరిగాయి. మిట్టూరు నాయుడు బిల్డింగ్స్ ఎస్పీసీ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి చిత్తూరు, పుత్తూరు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, గాలి భానుప్రకాష్‌లు హాజరై నగరంలోని కమ్మ సంఘం ప్రతినిధులకు, సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అవధాని మేడసాని మోహన్ తొలుత 2025 విశ్వావసు నామ సంవత్సర పంచాంగ శ్రవణం చేశారు. ప్రముఖ కవి హరినాయుడు, కళాకారుడు రాజశేఖర్ నాయుడు తమ సాహితీ సాంస్కృతిక కళలతో అలరించారు. ఉగాది పచ్చడి, వడపప్పు, పానకం పంపిణీ చేశారు. యువతీ, యువకులు, చిన్నారుల ఆట పాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో బాలాజి వాచ్ అండ్ మొబైల్స్ అధినేత వెంకటేశులు నాయుడు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, గురజాల చెన్నకేశవులు నాయుడు, కేశవులు నాయుడు, ఎల్ఐసీ రామ్మూర్తి నాయుడు, కమాలకర్ నాయుడు, జీవరత్నం నాయుడు, దేవరాణి, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మునెమ్మను అక్కున చేర్చుకున్న 'అమ్మఒడి'



మునెమ్మను అమ్మఒడికి తీసుకొస్తున్న నిర్వాహకుడు పద్మనాభ నాయుడు

చిత్తూరు రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రశాంత్‌నగర్‌లో ఇటీవల కుమారస్వామి అనే వృద్ధుడు మృతి చెందగా.. వృద్ధురాలైన భార్య మునెమ్మ (75) తప్ప ఎవరూ లేకపోవడంతో అమ్మఒడి ఆశ్రమ నిర్వాహకులు అంత్యక్రియలు నిర్వహించారు. అప్పటి నుంచి మునెమ్మ ఒంటరిగా ఉంటోంది. ఆమె పరిస్థితిని గమనించిన స్థానికులు అమ్మఒడి ఆశ్రమ నిర్వాహకులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆదివారం అమ్మఒడి ఆశ్రమ నిర్వాహకుడు పద్మనాభ నాయుడు ఆమెకు ఆశ్రమంలో ఆశ్రయం కల్పించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆశ్రమ సభ్యులు ప్రభా, మధు, వాసుదేవన్, భారతి, సూరి పాల్గొన్నారు.

విభజన రాజకీయాలను అడ్డుకుందాం: సీపీఐ



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు

చిత్తూరు రూరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): దేశంలో కుల, మత తత్వాలతో పాలకులు విభజన రాజకీయాలకు తెరలేపి దేశంలో అశాంతికి, అలజడులకు కారకులవుతున్నారని.. వాటిని భగత్ సింగ్ విప్లవ స్ఫూర్తితో అడ్డుకట్ట వేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా సీపీఐ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. నాగరాజు మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్య వాదులను గడగడలాడించి స్వాతంత్ర సాధనలో ప్రముఖ పాత్ర వహించిన విప్లవ వీరుడు భగత్‌సింగ్ అని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గోపీనాథ్, చంద్ర, జయలక్ష్మి, మణి, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

చిత్తూరు కల్చరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక కణ్ణన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం సిద్ధి సమాధియోగా శిక్షణా సంస్థ చిత్తూరు శాఖ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 120 మంది దీర్ఘ కాలిక రోగులను తిరుపతి శ్రీవెంకటేశ్వర ఆయుర్వేద వైద్య కళాశాల డాక్టర్లు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందచేశారు. అదే విధంగా చిత్తూరు మోహన్ డయాబిటిక్ వైద్యశాల డాక్టర్లచే 100 మంది మధుమేహ రోగులకు ఉచిత రక్త పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. అనంతరం ఉచిత వైద్య శిబిరానికి సహకరించిన తిరుపతి ఎస్వీ ఆయుర్వేద కళాశాల, మోహన్ డయాబిటిక్ వైద్యులకు సిద్ధి సమాధి యోగా గురువులు నరేంద్ర కుమార్, బ్రహ్మయ్య కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు.

గొల్లపల్లిలో జల్లికట్టు



ఎద్దును పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్న యువకులు

పెనుమూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండలం కేసీపల్లి పంచాయతీ గొల్లపల్లి గ్రామంలో ఆదివారం జల్లికట్టు నిర్వహించారు. సంక్రాంతికి గ్రామాల్లో ఎద్దుల పండుగ నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలో గొల్లపల్లిలో నిర్వహించిన ఎద్దుల పండగకు చుట్టుపక్కల మండలాల నుంచి ఎద్దులను పెద్ద ఎత్తున తీసుకువచ్చారు. అల్లిలో యువకులు ఎద్దులను నిలువరించడానికి ఎగబడ్డారు. సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

గ్రామకంఠం భూమిని కాపాడండి



మీడియాతో మాట్లాడుతున్న గ్రామస్తులు

చిత్తూరు సిటీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): దురాక్రమణ నుంచి గ్రామకంఠం భూమిని కాపాడాలని గంగాధరనెల్లూరు మండలం రామానాయుడుపల్లి దళితులు కోరారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ తమ గ్రామంలోని ఐదు సెంట్ల గ్రామకంఠం భూమిలో ప్రజల సౌకర్యార్థం కమ్యూనిటీ హాలు నిర్మించుకున్నట్లు చెప్పారు. మిగిలిన స్థలంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్తులు నిర్ణయించుకున్నట్లు చెప్పారు. కాగా తమ గ్రామానికి చెందిన పొన్నుస్వామి అనే వ్యక్తి ఆ భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఉచిత నేత్ర పరీక్షలు



రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

చిత్తూరు కల్చరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక రాముల గుడి వీధి జైన్ ప్రార్థనా మందిరంలో ఆదివారం చిత్తూరు జైన్ సంఘం ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. తిరుపతి అరవింద నేత్ర వైద్యశాల డాక్టర్ల సహకారంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో 114 మందికి కంటి పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 52 మందికి కంటి ఆపరేషన్లు అవసరం కాగా వారందరికీ ఉచితంగా వైద్యం చేయించనున్నట్లు సంస్థ అధ్యక్షులు సుభాష్‌జైన్ తెలిపారు. కార్యక్రమంలో ప్రేమ్‌చంద్, విశాల్, సాగర్, ప్రవీణ్, లలిత్, జ్యోతి, ఎవంత్, కమలేష్, అమిత్ జైన్లు పాల్గొన్నారు.

గుర్రపు వాహన సేవను విజయవంతం చేయండి

చిత్తూరు కల్చరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వరాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 9న నగర బలిజ సేవాసంఘం ఆధ్వర్యంలో స్వామి వారికి నిర్వహించే గుర్రపు వాహన సేవను విజయవంతం చేయాలని ఆ సంఘం నేత పూల సుబ్రమణ్యం నాయుడు కోరారు. ఆదివారం నగరంలోని బలిజ సేవా సంఘం కార్యాలయంలో బలిజ సంఘ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న బలిజ సంఘం నాయకులు ఓం రాందాస్, ఆరణి తులసిరాం, పూల గిరి మాట్లాడుతూ బలిజ కులస్థుల ఉభయానికి సహకరించాలని కోరారు.

విద్యుత్ తీగలను తొలగించండి

గుడిపాల, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్రాళ్ల మిట్ట కాలనీలో ఇంటి ముందే హెచ్‌టీ విద్యుత్ తీగలు పోవడం వల్ల గ్రామస్థులు గ్రామంలో తిరగడానికి భయభ్రాంతులకు గురవుతున్నారని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ హైవే తీగలు ఉండడం వల్ల ఆ పవర్‌కు పలువురికి గాయాలయ్యాయని, వాటిని తొలగించి వేరే ప్రాంతానికి మార్చాలని ఆయన డిమాండ్ చేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గుడిపాల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్నారు. గత సమావేశంలో వచ్చిన సమస్యలపై ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ప్రత్యేకదృష్టి పెట్టనున్నారు.